బిల్లు ఇవ్వలేదని మరుగుదొడ్లకు తాళం

● ఇబ్బంది పడుతున్న కృష్ణకాంత్ పార్కు వాకర్లు, సందర్శకులు



కృష్ణకాంత్ పార్కులో నిర్మాణం పూర్తయిన మరుగుదొడ్లు



మరుగుదొడ్లకు తాళం వేసిన కాంట్రాక్టర్



పార్కులో విరిగిన బల్లా

యూసుఫ్‌గూడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బిల్లు ఇవ్వలేదని కాంట్రాక్టర్ కృష్ణకాంత్ పార్కులో మరుగుదొడ్లకు తాళం వేశాడు. దీంతో వాకర్లు, సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

రెండు నెలలుగా తాళం

కృష్ణకాంత్ పార్కు గేటు వన్ సమీపంలోని మరుగుదొడ్లకు మరమ్మతు పనుల నిర్మాణం పూర్తయి రెండు నెలలైనా నేటికీ వినియోగంలోకి తీసుకురావడం లేదు. దీంతో ఉదయం పార్కుకు వచ్చే వాకర్లు, యోగాలో పాల్గొనే శిక్షకులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చివరి బిల్లు ఇవ్వలేదని కాంట్రాక్టర్ పార్కులోని మూత్రశాలలకు తాళం వేయడంతో కొంతమంది సందర్శకులు మూత్రశాలలకు వెనక వైపున బహిరంగ మూత్ర విసర్జన చేస్తూ వాకర్లకు, మహిళలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

పట్టించుకోని వాకర్స్ అసోసియేషన్

కృష్ణకాంత్ పార్కు వాకర్స్ అసోసియేషన్ సమస్యలను పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఆరు నెలలుగా మరుగుదొడ్లు లేక పార్కులో ఇబ్బందులు పడుతుంటే పలుమార్లు అసోసియేషన్ దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని వాకర్లు, సందర్శకులు ఆరోపిస్తున్నారు. గేట్-3 నుంచి అక్కడక్కడ నడకదారిలో లైట్లు వెలగడం లేదు. ఓపెన్‌జిమ్‌లో లైట్ లేక చీకటిలోనే జిమ్ చేస్తున్నారు. సాయంత్రం ఒక్కోసారి జిమ్‌కు తాళం వేస్తున్నారు. పార్కులో బల్లాలు అక్కడక్కడ విరిగిపోయి శిథిలావస్థలో ఉన్నాయి.

ఇబ్బంది పడుతున్నాం

ఆరు నెలలకు పైగా పార్కులో మరుగుదొడ్లు ఉపయోగంలో లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నాం. ఉదయం ఐదు గంటలకు వాకింగ్‌కు వస్తే మధ్యలో అత్యవసరం అయితే ఇంటికి వెళ్తున్నాం. యోగాకు వచ్చే వాళ్లు సుమారు రెండు గంటలకు పైగా పార్కులో ఉంటున్నారు. వీలైనంత త్వరగా మరుగుదొడ్లను అందుబాటులోకి తేవాలి.

● మహేష్, వాకర్

బల్లాల సంఖ్య పెంచండి

సందర్శకులు, వృద్ధులు కూర్చోవడానికి బల్లాలు సరిపోవడం లేదు. పార్కులో కూర్చోవడానికి బల్లాల సంఖ్య పెంచండి. ఉన్న బల్లాలకు మరమ్మతులు చేయించండి. ● జగదీష్, సందర్శకుడు

వారంలో అందుబాటులోకి తెస్తాం

కృష్ణకాంత్ పార్కులో నిర్మాణం పూర్తి చేసుకున్న మరుగుదొడ్లను సందర్శకులకు, వాకర్లకు వారం రోజుల్లో అందుబాటులోకి తెస్తాం. మరుగు దొడ్లకు పురుషులు, మహిళలు అనే పేరు బోర్డులు రాయించాలి. నల్లాలతో పాటు మరికొన్ని వస్తువులు రికార్డులో నమోదు చేయాలి. పనులు జరుగుతున్న సమయంలోనే ట్యాప్‌లు పోయాయి. జీహెచ్ఎంసీ స్వాధీనం చేసుకొని, యూబీడీ వాళ్లకు అప్పజెప్తాం. ● అవినాష్, జీహెచ్ఎంసీ ఏఈ



అమ్మవారికి వెండి కిరీటాలు అందజేస్తున్న యాదగిరి యాదవ్, సురేష్‌యాదవ్ తదితరులు

నల్లపోచమ్మకు వెండి కిరీటాలు అందజేత

బేగంపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బేగంపేట శ్యామ్‌లాల్ బిల్డింగ్‌లోని శ్రీ నల్లపోచమ్మ, దుర్గాదేవి ఆలయానికి రూ.2 లక్షల విలువైన వెండి కిరీటాలు, శఠగోపురాన్ని యాదగిరి యాదవ్ కుటుంబసభ్యులు సోమవారం అందజేశారు. యాదగిరి యాదవ్‌తోపాటు కుమారులు విజయ్‌యాదవ్, సురేష్‌యాదవ్, శ్రీను యాదవ్ కుటుంబసభ్యులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి వెండికిరీటాలను అందజేశారు.



బోనాల వేడుకల్లో భాగంగా ప్రకాశ్‌నగర్‌లోని శ్రీ భూలక్ష్మిదేవి ఆలయంలో జరిగిన రంగం కార్యక్రమంలో స్వర్ణలత, ఆలయ నిర్మాణ దాత విశాల్ సుధాం తదితరులు

● బేగంపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి)



హరిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే

బేగంపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సోమవారం సనత్‌నగర్‌లో పర్యటించారు. ఎస్ఆర్‌టీ కాలనీకి చెందిన భాస్కర్‌రెడ్డి ఇటీవల ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచనలు పాటించాలన్నారు. బీఆర్ఎస్ నాయకుడు హరి మాతృమూర్తి సులోచన ఇటీవల మరణించగా, సుభాష్‌నగర్‌లోని వారి నివాసానికి వెళ్లారు. ఆమె చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, నాయకుడు ఖలీల్‌బేగ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మోసిన్ ఖురేషి

క్యాటరాక్ట్ రహిత నియోజకవర్గంగా జూబ్లీహిల్స్

ఎర్రగడ్డ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌ను క్యాటరాక్ట్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు సంఘ సేవకుడు డాక్టర్ కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. క్యాటరాక్ట్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దే నేపథ్యంలో నియోజకవర్గ ముఖ్యనాయకులు, సంఘ సేవకులతో సోమవారం ఎర్రగడ్డలోని కళ్యాణ్ నగర్ వెంచర్ త్రీలో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాటరాక్ట్ సమస్యతో బాధపడుతున్న వారికి ఉచితంగా కంటి పరీక్షలు, ఆపరేషన్‌లు చేయించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందుకు నియోజకవర్గానికి చెందిన ముఖ్యనాయకులు, సంఘ సేవకులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఉచిత క్యాటరాక్ట్ ఆపరేషన్‌ను ముందుగా ఎర్రగడ్డ డివిజన్ నుంచి ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, సంఘ సేవకులు ఎర్ర కృష్ణ కుమార్, మొహ్మద్ మోసిన్ ఖురేషి, సుబ్రహ్మణ్యం రాజు, చౌదరి, రజినీకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వరూపానందేంద్ర సరస్వతికి పాదపూజ

చందానగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతికి సోమవారం చందానగర్ శిల్పా ఎన్‌క్లేవ్ లక్ష్మీగణపతి ఆలయంలో పాదపూజ జరిగింది. ఈ సందర్భంగా ఆయన లక్ష్మీగణపతిస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. చాతుర్మాస్య దీక్షలో ఉన్న స్వరూపానందేంద్రకు పలువురు పాదపూజ చేశారు. కార్యక్రమంలో ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి, ఆలయ ఫౌండర్ చైర్మన్ రమణమూర్తి, ఆలయ సేవా దళం సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మాగంటి సంస్మరణ సభను విజయవంతం చేయాలి

● ఎమ్మెల్యే కె.పి.వివేకానంద



సభ ఏర్పాట్లపై బీఆర్ఎస్ కార్యకర్తలతో చర్చిస్తున్న కె.పి.వివేకానంద

బోరబండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బోరబండ డివిజన్ ఎస్ఆర్ఆర్ పురం కాలనీ సైట్-5లోని పీజేఆర్ గ్రౌండ్‌లో ఈనెల 27న నిర్వహించనున్న దివంగత జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద అన్నారు. సభ ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. డివిజన్ ఇన్‌చార్జి హోదాలో బీఆర్ఎస్ కార్యకర్తలతో సభ ఏర్పాట్లపై ఆయన చర్చించారు. ఈ సందర్భంగా కె.పి.వివేకానంద మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించడమే మాగంటికి నిజమైన నివాళి అన్నారు. తనలాగే తెలుగుదేశం పార్టీ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి హ్యాట్రిక్ విజయాన్ని సాధించిన మాగంటి గోపీనాథ్ అకాల మరణం బాధాకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బోరబండ డివిజన్ అధ్యక్షుడు టి.కృష్ణమోహన్, ఎం.ఆనంద్‌కుమార్, ఎం.డి.సర్వర్, వి.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే బోరబండ బస్టాపు వద్దనున్న పోచమ్మ ఆలయాన్ని సందర్శించారు.

బోనాల వేడుకల్లో ఫ్లెక్సీ వివాదం

● కార్పొరేటర్ ఫొటో పెట్టనందుకు చింపేసిన కార్యకర్తలు ● పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

బంజారాహిల్స్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బోనాల వేడుకల్లో ఫ్లెక్సీ చించివేత వివాదంగా మారింది. బోనాల సందర్భంగా సోమాజిగూడ డివిజన్ ఎల్లారెడ్డిగూడ అంబేడ్కర్‌నగర్‌లో వివిధ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు వెలిశాయి. స్థానికులు కూడా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకున్నారు. అంబేడ్కర్‌నగర్‌కు చెందిన న్యాయవాది ఎం.జయవర్ధన్ కూడా తన ఇంటి ప్రాంగణంలో ఫ్లెక్సీ పెట్టుకున్నాడు. అదే రోజు రాత్రి కొందరు దానిని చించేశారు. బస్తీకి చెందిన గణేశ్, విజయ్, సంజయ్ తదితరులు తన ఫ్లెక్సీని ఉద్దేశపూర్వకంగా చించివేశారని ఆరోపిస్తూ జయవర్ధన్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఓ కానిస్టేబుల్ వచ్చి విచారణ చేయగా సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్ ఆదేశాల మేరకు ఫ్లెక్సీ చించేసినట్టు తేలింది. దీంతో కానిస్టేబుల్ కార్పొరేటర్‌కు ఫోన్ చేయగా తన ఆదేశాల మేరకు ఫ్లెక్సీ చించేయడం జరిగిందని, తన ఫోటో లేకుండా ఫ్లెక్సీ ఎలా పెడతారని ప్రశ్నించి ఫోన్ కట్ చేశారు. ఈ విషయంలో మాటామాట పెరిగి వాగ్వాదానికి దారి తీసింది. జయవర్ధన్ ఫ్లెక్సీ చింపిన వారితోపాటు సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్‌పై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మరో ఫిర్యాదు చేశారు. మధురానగర్ పోలీసులు విచారణ చేస్తున్నారు.



చింపేసిన ఫ్లెక్సీ

జట్లుగా విడిపోయి సిగ్నల్ పడినప్పుడే తనిఖీలు

● డ్రంక్ అండ్ డ్రైవ్ లెస్ సిటీగా మార్చడమే లక్ష్యం



తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఖైరతాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో మద్యం తాగి వాహనాలు నడపడం పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ట్రాఫిక్ పోలీసులు కృషి చేస్తున్నట్లు నగర ట్రాఫిక్ డీసీపీ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ప్రతిరోజూ వినూత్నంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న పోలీసులు సోమవారం ఖైరతాబాద్‌లో సిగ్నల్ పడినప్పుడు ఆగిన వాహనాల డ్రైవర్లకు తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్‌కు, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేవలం లైటెనింగ్ డీడీ పరీక్షలు చేస్తున్నామని, పోలీసులు బృందాలుగా విడిపోయి ఎక్కువ చోట్ల తనిఖీలు జరిగేలా చేస్తున్నామని డీసీపీ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదనే అవగాహన ప్రతి ఒక్కరిలో కలగాలనే ఉద్దేశంతోనే తనిఖీలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. తనిఖీల్లో అదనపు డీసీపీ రాములు, ఏసీపీ మోహన్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి పాల్గొన్నారు.



సోమాజిగూడలో జరిగిన తొట్టెల ఊరేగింపు కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎలిగల మహేష్ యాదవ్, ప్రసన్న, చలపతి తదితరులు

● బేగంపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి)



ఎస్ఆర్‌నగర్‌లో ఫలహారం బండి ఊరేగింపును ప్రారంభిస్తున్న నర్సింహ


ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు

అమీర్‌పేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వెంకటేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఫలహారం బండి ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, బల్కంపేట ఎల్లమ్మ ఆలయం మాజీ ధర్మకర్త కూతురు నర్సింహ ప్రతీ సంవత్సరం భారీ ఎత్తున అన్నదానం నిర్వహించి ఫలహారం బండి ఊరేగింపును డప్పు వాయిద్యాలు, డీజే చప్పుళ్లు, యువకుల డ్యాన్స్‌లు, కేరింతల నడుమ ఊరేగింపును అట్టహాసంగా నిర్వహిస్తారు. సాయంత్రం 7 గంటలకు వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు ఎస్ఎస్ బేకరీ, ఎల్లమ్మ ఆలయం, బీకేగూడ పార్కు, నల్లపోచమ్మ ఆలయం మీదుగా వెంకటేశ్వరస్వామి ఆలయం చేరుకుంది. కార్యక్రమంలో అశోక్ యాదవ్, సత్యనారాయణ, వరుణ్ యాదవ్, యశ్వంత్, రాహుల్ యాదవ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



ఎర్రగడ్డ నల్లపోచమ్మ ఆలయంలో బోనాలను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ చైర్మన్ శంకర్ నాయక్, మాజీ చైర్మన్ జి.రాము, సభ్యులు ఎస్.శివశంకర్, చిరంజీవి, రామచందర్, జి.వెంకటేష్ తదితరులు

● ఎర్రగడ్డ, ఆంధ్రజ్యోతి



పచ్చికుండపై నిలబడి భవిష్యవాణి చెబుతున్న మాతంగి రేణుక

కుంభ వర్షాలు.. అగ్ని దేవుడి ఆగ్రహం తప్పవు

● భవిష్యవాణిలో రేణుక

ఖైరతాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఈ సంవత్సరం భారీ వర్షాలు, అగ్ని ప్రమాదాలు, మహమ్మారితో నష్టం తప్పదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పూనకంతో భవిష్యవాణి వినిపించారు మాతంగి రేణుక. సోమవారం రాత్రి పచ్చికుండపై నిలబడి ఖైరతాబాద్ మహంకాళి ఆలయంలో భవిష్యవాణి తెలియజేశారు. ఆలయ చైర్మన్ కృష్ణ యాదవ్‌తో పాటు పెద్ద ఎత్తున హాజరైన భక్తుల మధ్య రేణుక పూజలు చేసి జ్యోతిష్యం చెప్పారు. కుంభ వృష్టికి నీటిలో కొట్టుకపోతారని, అగ్ని దేవుడు ఆగ్రహంతో ఉన్నాడని చెప్పిన ఆమె మహమ్మారి రానున్నదని, దానితో కుటుంబసభ్యుల్లో ఒకరికి ఒకరు కాకుండా పోతారని తెలియజేశారు. మహంకాళి ఆలయంలో గాలి గోపురం కడతామని 3 సంవత్సరాలుగా చెప్తున్నా కట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఊరి పొలిమేర చుట్టూ బలి కట్టి పూజలు చేస్తే గాలి, గత్తరలు లేకుండా చూస్తానని తెలిపిన ఆమె ఈసారి పూజలతో తృప్తి చెందానని అన్నారు. ఆలయ నిర్వాహకుడు 9 వారాలు ఉపవాసం ఉండి పూజలు చేస్తే అంతా మంచి జరుగుతుందని చెప్పారు. రంగంలో ఆలయ నిర్వాహకులు మధుకర్ యాదవ్, శ్రీశైలం యాదవ్, మహేష్ యాదవ్, రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చౌరస్తా విస్తరణ ఎప్పుడో?

- శేరిలింగంపల్లిలో అన్ని రహదారులను అభివృద్ధి చేస్తున్న అధికారులు
- గుల్‌మొహర్ చౌరస్తా వైపు కన్నెత్తి చూడని వైనం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



గుల్‌మొహర్ చౌరస్తా

గచ్చిబౌలి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. వాహనదారులు నిత్యం గంటల తరబడి ట్రాఫిక్‌లోనే ఉండాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. సమస్యను దృష్టిలో పెట్టుకొని అధికారులు ఇటీవలి కాలంలో నియోజకవర్గంలోని ప్రధాన, అంతర్గత రహదారులపై ఉన్న దాదాపు అన్ని చౌరస్తాలను విస్తరించి అభివృద్ధి చేశారు. అయితే, గుల్‌మొహర్ చౌరస్తాను మాత్రం పట్టించుకోలేదని వాహనదారులు విచారం వ్యక్తం చేస్తున్నారు. లింగంపల్లి పరిసర ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. దానికితోడు శేరిలింగంపల్లికి అతి సమీపంలో ఉన్న రామచంద్రాపురం, పటాన్‌చెరు, అమీన్‌పూర్, తెల్లాపూర్ అనతికాలంలోనే అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయి. ఈ ప్రాంతాల్లో ఎక్కువ శాతం విల్లాలు, అపార్టుమెంట్లు, బహుళ అంతస్తుల మేడలు భారీ సంఖ్యలో వెలిశాయి. ఇక్కడ నివాసం ఉండే వారంతా నగరానికి రాకపోకలు సాగించేందుకు ఈ చౌరస్తానే ప్రధాన మార్గం. మరోవైపు ఈ ప్రాంతాల నుంచి అధికంగా ఐటీ ఉద్యోగులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ట్రాఫిక్ సమస్యతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చౌరస్తాను విస్తరించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

చౌరస్తాను విస్తరించాలి



గుల్‌మొహర్ చౌరస్తాను విస్తరిస్తే ట్రాఫిక్ సమస్య కొంతవరకు తగ్గుతుంది. అయితే, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీనిపై పలుమార్లు ఉపకమిషనర్, జోనల్ కమిషనర్‌కు వినతిపత్రాలు ఇచ్చాం. అయినా, ఎలాంటి ఫలితం ఉండడం లేదు. పరిస్థితి ఇలానే కొనసాగితే స్థానికులతో కలిసి ధర్నా చేస్తాం. అధికారులు వెంటనే స్పందించి చౌరస్తాను విస్తరించాలి. - రామస్వామి, మాజీ కౌన్సిలర్, లింగంపల్లి

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

ఇటీవలే బదిలీపై ఇక్కడకు వచ్చాను. చౌరస్తాను పరిశీలించి అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. ట్రాఫిక్ సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తున్నాం. లింగంపల్లి ఆర్‌టీబీ సైతం మంజూరైంది. త్వరలోనే దానిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం.

- ప్రశాంతి, ఉపకమిషనర్, శేరిలింగంపల్లి



తోట ముత్యాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే శ్రీగణేష్, చింతల వేణుగోపాల్ రెడ్డి

ఘనంగా బోనాలు

తిరుమలగిరి జూలై 21 (ఆంధ్రజ్యోతి): బొల్లారంలో రెండు రోజుల పాటు నిర్వహించిన బోనాల వేడుకల్లో భాగంగా సోమవారం డప్పుల దరువులు, పోత రాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, ఫలహారం బండ్ల ఊరేగింపులతో కన్నుల పండుగగా సాగాయి. డౌటన్ బజార్‌లోని తోట ముత్యాలమ్మ దేవాలయంలో రెండు రోజుల పాటు వేడుకలు వైభవంగా జరిగాయి. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ చింతల వేణుగోపాల్ రెడ్డితో పాటు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా సదర్‌బజార్‌లోని మహంకాళి దేవాలయంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌లు అమ్మవారిని దర్శించుకున్నారు. భవిష్యవాణి రంగంలో అమ్మవారు అందరినీ చల్లంగా చూసుకుంటానని, సంవృద్ధిగా వర్షాలు కురుస్తాయని వినిపించారు.

ఎమ్మెల్యేకు పరామర్శల వెల్లువ

సికింద్రాబాద్, జూలై 21(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు శ్రీగణేష్‌ను సోమవారం కంటోన్మెంట్‌తోపాటు ఇతర అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిశారు. ఆదివారం రాత్రి ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో ఆగంతకులు ఎమ్మెల్యే కాన్వాయ్‌పై దాడి చేసిన అంశమై మాట్లాడారు. మహాకాళి అమ్మవారి ఆశీస్సులతో సురక్షితంగా బయట పడ్డారంటూ ఎమ్మెల్యేకు చెప్పారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, బోయినపల్లి మార్కెట్ చైర్మన్ రాగీరు ఆనంద్‌బాబు, మాజీ చైర్మన్ ముప్పిడి గోపాల్, డి.బి.దేవేందర్, పాండురంగ విఠలేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ అల్లాడి గౌరీశంకర్, బద్ధం బల్వంత్‌రెడ్డి, పిట్ల నాగేష్ ముదిరాజ్ పలువురు నాయకులు శ్రీగణేష్‌ను కలిసిన వారిలో ఉన్నారు.



ఏసీపీ రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్

నిందితులను కఠినంగా శిక్షించాలి

తిరుమలగిరి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీగణేష్ బోనాల వేడుకల్లో పాల్గొనడానికి సికింద్రాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ మాణికేశ్వరనగర్‌కు వెళుతుండగా ఆదివారం రాత్రి జరిగిన దాడికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జి.అరవింద్‌తో కూడిన బృందం తిరుమలగిరి డివిజన్ ఏసీపీ రమేష్‌ను కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓ ఎమ్మెల్యేపై దాడికి యత్నించడం పిరికిపందల చర్య అన్నారు. ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు రషీద్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జీవి బాల్‌రాజ్, సతీష్, కాంగ్రెస్ నాయకులు అరవింద్, ప్రవీణ్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.



మారేడుపల్లి మైసమ్మ అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీ ఈటెల రాజేందర్



బోనాల జాతర ఉత్సవాల్లో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్

వైభవంగా మైసమ్మ బోనాల జాతర

మారేడుపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : బోనాల జాతర ఉత్సవాలు సోమవారం మారేడుపల్లి మైసమ్మ ఆలయంలో ఘనంగా జరిగాయి. ఆలయ నిర్వాహకులు సి.కృష్ణ యాదవ్, తిరుమల వంశీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జరిగిన జాతరకు రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. అంతకుముందు జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యుత్ అలంకరణలు భక్తులను మంత్ర ముగ్ధులను చేశాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా నాయకురాలు కుమారి వైష్ణవి, పెద్ద సంఖ్యలో నగర నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులు బోనాల జాతర ఉత్సవాల్లో పాల్గొని సందడి చేశారు.

వర్షా కాలం.. పూల మొక్కలకు డిమాండ్







అమ్మకానికి సిద్ధంగా ఉన్న వివిధ రకాల మొక్కలు

చిలకలగూడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం, మొక్కలు అంటే ఇష్టపడని వారుండరు. కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరంలో పచ్చదనం, ఆక్సిజన్ రోజురోజుకి కరువైపోతున్నది. కరోనా మహమ్మారి వల్ల ఆక్సిజన్‌ను కొనుగోలు చేయాల్సిన అవసరం ఏర్పడింది. అపార్ట్‌మెంట్‌లు, సొంత ఇంటిలో ఖాళీ స్థలం, బాల్కనీలు ఉన్నవారు మిద్దె వ్యవసాయానికి ఆసక్తి కనబరుస్తున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో పూలు, ఔషధ మొక్కలకు డిమాండ్ పెరిగింది. కొందరు వ్యాపారులు సైకిళ్లపై వచ్చి కాలనీలు, బస్తీలో పలు రకాల మొక్కలను అమ్ముతున్నారు. మరికొందరు రద్దీగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్‌కి అంతరాయం లేకుండా మొక్కల అమ్మకాలు సాగిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. సికింద్రాబాద్‌లోని పలు ప్రాంతాల్లోని మెట్టుగూడ, ఆలుగడ్డ బావి, బ్లూసీ హోటల్, మారేడుపల్లి, తిరుమలగిరి క్రాస్ రోడ్స్‌లలో మొక్కలుఉ లభ్యమవుతున్నాయి. పలు రకాల మొక్కలను రాజమండ్రి దగ్గరలోని కడియం నుంచి తీసుకువచ్చి అమ్మకాలు చేస్తూ, జీవనోపాధి పొందుతున్నామని ఓ వ్యాపారి తెలిపారు. మొక్కల ధరల విషయానికి వస్తే 50 రూపాయల నుంచి 4వేల వరకు పలుకుతున్నాయి.

మొక్కలంటే ప్రాణం



ఇంటి వద్ద ఉన్న ఖాళీ స్థలంలో కొన్ని కూరగాయలు, పూలు మొక్కలు పెంచుతుంటా. వర్షాకాలం రాగానే మట్టి మార్చి ఎరువులు వేయటం వల్ల ఇంటికి కూరగాయలు, పూలు కొనాల్సిన అవసరం రావటం లేదు. చాలా ఇష్టంగా మొక్కలను ఎలాంటి క్రిమి సంహారక మందులు వాడకుండా పెంచుకుంటాను.

- షంసున్నీసాబేగం (గృహిణి)

బాల్కనీలో మొక్కల పెంపకం



మా అపార్ట్‌మెంట్ బాల్కనీలో వివిధరకాల పూల మొక్కలు, క్రోటన్స్ ఇష్టంగా పెంచుకుంటాం. వర్షాకాలం రాగానే మట్టిని మార్చి కొత్త మట్టిని వేసి జాగ్రత్తగా చూసుకుంటాను. చిన్నతనం నుంచి మొక్కలంటే ఇష్టం.

- ఎల్.నిర్మల (ప్రభుత్వ ఉద్యోగి)

జోరుగా అమ్మకాలు



వర్షాకాలం ప్రారంభం కావడంతో భారీ డిమాండ్ వుంది. పూల మొక్కలు, తులసి వంటి వాటిని అధికంగా కొనుగోలు చేస్తున్నారు. రాజమండ్రి వద్ద కడియం నుంచి వివిదరకాల మొక్కలను తీసుకువచ్చి అమ్మకాలు సాగించి జీవనోపాధి సాగిస్తున్నా. ఒకసారి కొనుగోలు చేసినవారు మరలా వచ్చి తీసుకువెళుతుంటారు. ప్రభుత్వం సదుపాయాలు కల్పిస్తే ఎంతోమందికి జీవనోపాధి లభిస్తుంది.

- శంకర్, మొక్కల వ్యాపారి

మురుగునీటి సమస్యను పరిష్కరించండి





అడ్డగుట్ట పరిసర ప్రాంతాల్లో రోడ్లపై మురుగునీటి ప్రవాహంతో అవస్థలు పడుతున్న వాహనదారులు

సికింద్రాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తరచూ మురుగునీరు పొంగి రోడ్లపై ప్రవహిస్తుండడంతో అడ్డగుట్ట పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అడ్డగుట్టలోని ఏ ప్రాంతంలో, ఏ రోజు డ్రైనేజీ పొంగుతుందో, రోడ్లపై మురుగునీరు పారుతుందో తెలియని దుస్థితి. తాజాగా ఆది, సోమవారం జయప్రకాష్‌నగర్, గంగా జమున హోటల్ పరిసరాల్లో మురుగునీరు ఏరులై పారడంతో ప్రజలు పడిన అవస్థలు అన్నీ ఇన్నీ కావు. మూడు పాఠశాలలు, దుకాణాలు, వర్తక, వాణిజ్య సంస్థలు ఉండడం, నిత్యం వందలాది వాహనాలు, వేలాదిమంది రాకపోకలు సాగించే ప్రాంతం కావడంతో పలువురు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

మురుగునీటి సమస్య విషయమై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మురుగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ఎన్ఎస్‌యూఐ నాయకుడి దిష్టిబొమ్మ దహనం

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 21(ఆంధ్రజ్యోతి) : ఏబీవీపీ ఆధ్వర్యంలో ఎన్ఎస్‌యూఐ ఒడిశా రాష్ట్ర అధ్యక్షుడి దిష్టిబొమ్మను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఆవరణ సోమవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం ఎన్ఎస్‌యూఐ నాయకుడు ఉదిత్ ప్రధాన విద్యార్థినిపై లైంగిక దాడి చేసి, తన ఆత్మహత్యకు కారణయ్యాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగం చేతిలో పట్టుకొని దళితులకు, మహిళలకు, నిమ్నవర్గాలకు తోడుగా ఉంటామని దేశమంతా తిరిగే రాహుల్ గాంధీ ఈ ఘటనపై నోరు విప్పాలని డిమాండ్ చేశారు. ఎన్ఎస్‌యూఐ సంస్థను రద్దు చేయాలన్నారు. లేని పక్షంలో విద్యార్థులను జాగృతం చేసి వారిని తరిమి కొట్టే విధంగా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఒడిశా ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ కోర్టులో ఈ కేసును విచారించి వెంటనే నిందితుడికి కఠిన శిక్ష విధించాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ సిటీ సెక్రటరీ పృథ్వీ తేజ, జాతీయ కార్యవర్గ సభ్యులు జీవన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అలివేలి రాజు, విద్యానగర్ విభాగ కన్వీనర్ హరి ప్రసాద్, రాష్ట్ర కార్యసమితి సభ్యుడు కమల్ సురేష్, జిల్లా కన్వీనర్లు ఉదయ్, వినయ్, సాయితేజ, యూనివర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు ధృహన్, శివశంకర్, విద్యార్థి నాయకులు, హైదరాబాద్ సిటీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మందుబాబులపై చర్యలు తీసుకోవాలి

- ఎన్ఎస్‌యూఐ నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఓయూ మందుబాబులకు అడ్డాగా మారిందని, వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సోమవారం ఎన్ఎస్‌యుఐ నాయకులు ఆర్ట్స్ కళాశాల వద్ద ఉన్న రోడ్డుపై ధర్నాకు దిగారు. బోనాల పండుగ నేపథ్యంలో బయట వ్యక్తులు వచ్చి ఓయూలోని ప్రధాన రహదారి పక్కన, పలు కళాశాలల వద్ద మందు తాగుతూ నానా హంగామా సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. ప్రశ్నించిన విద్యార్థి నాయకులపై దాడులకు తెగబడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల ఎదుట ఈవిధంగా జరుగుతుంటే వారు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. అనంతరం ధర్నాకు దిగిన విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడానికి ప్రయత్నించారు. మద్యం తాగుతున్న వారిని బయటికి పంపకుండా తమను అరెస్ట్ చేయడానికి ప్రయత్నిస్తారా? అంటూ ప్రశ్నించారు. దీంతో కొంత ఉద్రిక్తత వాతావరణ చోటుచేసుకుంది. ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఆ తర్వాత సర్దిచెప్పడంతో శాంతించి ధర్నా విరమించారు.



రోడ్డుపై బైఠాయించి నిరసన చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

బోనాల జాతరలో ఆధ్యాత్మిక సందడి



జాతరలో పాల్గొన్న భక్తులు

బౌద్ధనగర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డప్పు చప్పుళ్లు, యువకుల నృత్యాలతో తొట్టెలు, ఫలహారబండ్లు ఊరేగింపు, భవిష్యవాణి వినిపించే రంగం కార్యక్రమాలతో చిలకలగూడ కట్టమైసమ్మ, నల్లపోచమ్మ అమ్మవార్ల బోనాల జాతరలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఆలయ వంశీకులు కానుగుల అంజనేయులు పాపయ్య, గుంటి శ్రీనివాస్‌లు సమర్పించిన పచ్చికుండపై నిలబడి పాతబస్తీకి చెందిన మాతంగి లక్ష్మమ్మ చెప్పిన భవిష్యవాణి కార్యక్రమాన్ని భక్తులు ఆసక్తిగా వీక్షించారు. జాతరలో ప్రత్యేక ఆకర్షణగా తొట్టెలు, ఫలహారబండ్లు నిలిచాయి.

ఆలయ కార్యనిర్వహణాధికారి మహేందర్‌గౌడ్, ఫెస్టివల్ కమిటీ చైర్మన్ గుంటి కృష్ణ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లును చేశారు. చిలకలగూడ డివిజన్ ఏసీపీ శశాంక్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- ఆలయం వద్ద సోమవారం రాత్రి వారాసిగూడ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. అధ్యక్షుడు కె.సుధాకర్, ప్రధాన కార్యదర్శి రాజేశ్, కోశాధికారి ఎంవీ శేఖర్, ఉపాధ్యక్షుడు అలకంటి శివకుమార్, సభ్యులు రఘుకుమార్, వెంకటేశ్, రమేష్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మృతి



గడప శ్రీనివాస్(ఫైల్)

బౌద్ధనగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గడప శ్రీనివాస్(51) అనారోగ్యంతో సోమవారం తెల్లవారుజామున బౌద్ధనగర్‌లో ఆయన నివాసంలో మృతి చెందారు. కొన్నిరోజులు శ్రీనివాస్ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మొదట్లో బీజేపీ కార్యకర్త అయిన శ్రీనివాస్ తర్వాత తలసాని శ్రీనివాస్‌యాదవ్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరి టీడీపీ ప్రభుత్వ హాయంలో మూడు పర్యాయాలు బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడిగా పనిచేశారు. మూడు సంవత్సరాల క్రితం సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావుగౌడ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సోమవారం ఉదయం బౌద్ధనగర్‌లో ఆయన నివాసంలో శ్రీనివాస్ మృతదేహానికి సనత్‌నగర్ శాసనసభ్యుడు శ్రీనివాస్‌యాదవ్, కార్పొరేటర్లు శైలజ, హేమ, టీడీపీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాసకుమార్, బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, బీజేపీ రాష్ట్ర నాయకుడు వెంకటరమణి, మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, బీఆర్ఎస్ పద్మారావునగర్ డివిజన్ అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, సీనియర్ నాయకుడు సంజీవ్‌ముదిరాజ్, టీడీపీ బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు గరిగె ప్రవీణ్‌కుమార్, పొట్టి శ్రీను తదితరులు నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



ఆలయ దర్శనం

రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ వెంకట్రావ్ సోమవారం ఉదయం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన సతీమణి బోనమెత్తుకుని ఆలయానికి విచ్చేశారు. బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి వారికి స్వాగతం పలికారు.

- సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి



చిలకలగూడ కట్టమైసమ్మ, పోచమ్మ ఆలయంలో సోమవారం రాత్రి భవిష్యవాణి వినిపిస్తున్న మాతంగి లక్ష్మమ్మ

తొమ్మిది వారాలు పాటు సాక పోస్తే కష్టాలు రాకుండా బిడ్డలను కడుపులో పెట్టుకుంటా

- రంగం కార్యక్రమంలో భవిష్యవాణి లక్ష్మమ్మ

బౌద్ధనగర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): తొమ్మిదివారాల పాటు సంతృప్తిగా సాక పోస్తే ఎటువంటి కష్టాలు రాకుండా బిడ్డలను కడుపులో పెట్టి చూసుకుంటానని చిలకలగూడ రంగంలో భవిష్యవాణిలో వినిపించింది. సోమవారం రాత్రి చిలకలగూడ కట్టమైసమ్మ, నల్లపోచమ్మ ఆలయంలో నిర్వహించిన రంగం కార్యక్రమంలో పచ్చికుండపై పాతబస్తీకి చెందిన మాతంగి లక్ష్మమ్మ నిలబడి భవిష్యవాణి ద్వారా భక్తులు అడిగిన ప్రశ్నలకు జవాబు ఇచ్చింది. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, నరదృష్టి ఎక్కువగా ఉందని, ఈ ఏడాది వైభవంగా జరిపిన బోనాలతో సంతృప్తి చెందానని తెలిపింది. మహమ్మారి వ్యాధులు వ్యాపించకుండా నేను అడ్డుపడుతున్నానని, అశ్రద్ధచేస్తే ఫలితం అనుభవిస్తారని హెచ్చరించింది. ఆలయాన్ని అభివృద్ధి చేయాలని సూచించింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్, ఆలయ కార్యనిర్వహణాధికారి మహేందర్‌గౌడ్, ఫెస్టివల్ కమిటీ చైర్మన్ గుంటి కృష్ణ, సభ్యులు జంగిలి దేవేందర్‌యాదవ్, జగన్‌రెడ్డి, శ్రీనివాస్‌ముదిరాజ్ ప్రధాన అర్చకులు తిరుమాలాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫలహారం బండ్లు, తొట్టెల ఊరేగింపు



ఫలహారం బండ్లు, తొట్టెల ఊరేగింపులో నృత్యం చేస్తున్న జంపన ప్రతాప్



6వ వార్డులోని మహాత్మానగర్ ఆలయంలో పూజలు చేస్తున్న పాండు యాదవ్

బోయినపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢమాస బోనాల జాతరను పురస్కరించుకుని బోయినపల్లి 1వ వార్డు, 6వ వార్డుల్లో వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి, సోమవారం ఫలహారం బండ్ల, తొట్టెల ఊరేగింపు కార్యక్రమాలు జరిగాయి.

న్యూ బోయినపల్లిలోని జైరామ్ వ్యాయామశాల, చిన్నతోకట్ట సంజీవయ్య కాలనీ, బాపూజీ నగర్, కృష్ణారెడ్డి కాలనీ, నేతాజీ నగర్ ప్రాంతాల్లో ఫలహారం తొట్టెల ఊరేగింపును కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కంటోన్మెంట్ 6వ వార్డులోని సీతారాంపురం, మహాత్మానగర్, తాడ్‌బండ్, మర్రి రామ్‌రెడ్డి కాలనీ, సందమూరినగర్ ప్రాంతాల్లో జరిగిన వేడుకలు స్థానిక బోర్డు మాజీ సభ్యుడు పాండు యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఫలహారం బండ్ల, తొట్టెల ఊరేగింపును ప్రారంభించారు.

ముఖ్యంగా ఏడుగుడుల దేవాలయం వద్ద ధగడు సాయి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండ్ల, తొట్టెల ఊరేగింపు అందరిని ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో నగర నలుమూలల నుంచి వచ్చిన వందలాదిమంది భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది.









బోయినపల్లిలోని ఏడు దేవాలయాల వద్ద రంగం సందర్భంగా ఫలహార బండ్ల ఊరేగింపు దృశ్యాలు